క్లుప్తంగా

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ దారుణం: మాజీ ఎమ్మెల్యే



ఎమ్మెల్యే ద్వారకారెడ్డిని కలిసి సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్ దారుణమని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ తాను వారి చిన్నాన్న తంబాలపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డిని కలిసి సంఘీభావం తెలిపినట్లు చెప్పారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని స్పష్టం చేశారన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలే కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడం ఖాయమని బాలరాజు అన్నారు.

ధర్మస్థల ఘటనలపై దర్యాప్తు వేగవంతం చేయాలి



ఆందోళన చేస్తున్న ఏపీ మహిళా సమాఖ్య సభ్యులు

కుక్కునూరు: కర్ణాటక ధర్మస్థలం ఘటనలపై ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఏపీ మహిళా సమాఖ్య కుక్కునూరు మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల మాట్లాడుతూ గత పది రోజులుగా వెలుగులోకి వస్తున్న కర్ణాటక రాష్ట్రంలోని మంజునాథ దేవాలయం ధర్మస్థలంలో వందలాది మంది యువతులు, మహిళలపై దారుణమైన అత్యాచార ఘటనలు తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయన్నారు. ఈ ఘటనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర దర్యాప్తు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మీ పార్వతి, ఆదిలక్ష్మి, జ్యోతి, రాజేశ్వరి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

'ముళ్లపూడి'కి ఘన నివాళి

జంగారెడ్డిగూడెం: ది ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్ అధినేత దివంగత డాక్టర్ ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్ జయంతిని సోమవారం ఫ్యాక్టరీ ఆవరణలో నిర్వహించారు. ది ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్, షుగర్ యూనిట్–2, తాడువాయి ఫ్యాక్టరీలో పనిచేస్తున్న సిబ్బంది హరిశ్చంద్ర ప్రసాద్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ ఇన్‌చార్జి రాయుడు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతల శాఖ అధికారుల దాడులు



పాన్‌షాప్‌లో తనిఖీలు చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: తూనికలు, కొలతల శాఖ అధికారులు సోమవారం సాయంత్రం కొయ్యలగూడెంలోని పలు దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. నేషనల్ కన్స్యూమర్ హెల్ప్ లైన్‌కు వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీలు చేపట్టినట్లు లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్ తెలిపారు. పోత వరం రోడ్డులోని కిళ్లీ షాపులు, పోలవరం రోడ్డులోని హోల్‌సేల్ కిరాణా మర్చంట్ షాపుల్లో తనిఖీలు నిర్వహించి, దుకాణదారులపై కేసులు నమోదు చేశారు.

అంతర్గత రోడ్ల ఆక్రమణ

చర్యలు చేపట్టాలని కోరుతున్న ప్రజలు

కొయ్యలగూడెం: పరింపూడి పంచాయతీ పరిధిలో అంతర్గత రోడ్ల ఆక్రమణతో తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. 6 నుంచి 8 గజాల వరకు ఉండే రోడ్లు ఇరువైపులా ఆక్రమణల పాలవుతుండడంతో ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లే దుస్థితికి వచ్చాయన్నారు. డ్రైనేజీ సదుపాయం లేక అదే విధంగా పైపులైన్లు నిర్మాణం చేసుకోలేక దిగువన ఉండే స్థానికులు ఇళ్ల నిర్మాణం చేసుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ ప్రధాన రహదారికి ఆనుకుని ఉండే పంచాయతీ కార్యాలయ స్థలాన్ని ఆక్రమించి షాపు కట్టుకునే పరిస్థితి వచ్చింది అంటే ఆక్రమణదారులు ఏ విధంగా రెచ్చిపోతున్నారు తెలుస్తోందని మాజీ సర్పంచ్ పోలా సోమయ్య పేర్కొన్నారు.

డ్రెయినేజీని వదలని ఆక్రమణదారులు

బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వెనుక డ్రెయినేజీ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కబ్జా చేసి ఏకంగా భవన నిర్మాణంతో పాటు ప్రహరీ గోడ నిర్మిస్తున్నారని ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు ఆరోపిస్తున్నారు. అంతర్గత రోడ్ల ఆక్రమణతో వాహనాలు రాకపోకలు సాగించలేకపోతున్నాయని ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో వచ్చే వాహనాలకు అంతరాయం కలుగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. విద్యార్థులను తీసుకొచ్చే టాటా ఏస్‌లు సైతం అంతర్గత రోడ్లలోకి రాలేకపోతుండడంతో విద్యార్థులు అవస్థలకు గురి అవుతున్నారని వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇటువంటి సమస్యలపై తహసీల్దార్ కార్యాలయంతో పాటు కలెక్టరేట్‌లో గత సంవత్సరం ఫిబ్రవరిలో ప్రజలు చేసిన ఫిర్యాదులకు అప్పటి జాయింట్ కలెక్టర్ స్పందించి ఆక్రమణలు తొలగించాల్సిందిగా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. అయితే ప్రభుత్వం మారిన దరిమిల సమస్య మళ్ళీ మొదటి వచ్చిందని రాజకీయ అండదండలతో ఆక్రమణదారులు యదేచ్ఛగా తమ పని తాము చేసుకుపోతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. దీనిపై పంచాయతీ అధికారులు పాలకవర్గం స్పందించి ఆక్రమణలు తొలగించాలి అని కోరుతున్నారు.



పంచాయతీ కార్యాలయ స్థలాన్ని ఆక్రమించి కట్టిన షాపు



బీఎస్ఎన్ కార్యాలయం వెనుక డ్రెయినేజీని ఆక్రమించి కడుతున్న భవనం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం: రేచర్ల సబ్‌స్టేషన్ పరిధిలో గల యర్రగుంటపల్లి ఏజీఎల్ ఫీడర్ పరిధిలో గల గ్రామాలకు ఆర్‌డీఎస్ఎస్ పనులు చేపట్టనున్నారు. ఈ పనుల నిమిత్తం ఈ నెల 29వ తేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. కావున ఆయా గ్రామాల పరిధిలో గల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

బుట్టాయగూడెం: ఆగస్టు 9వ తేదీన కేఆర్‌పురం ఐటీడీఏ కార్యాలయంలో జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు కోరారు. సోమవారం ఐటీడీఏ మీటింగ్ హాల్‌లో పీఓ రాములు నాయక్ అధ్యక్షతన ఆదివాసీ సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీ హక్కులు, సంస్కృతి, జీవన విధానంపై సమాజంలో విస్తృత అవగాహన అవసరమన్నారు. ఆదివాసీ దినోత్సవాన్ని సందేశాత్మకంగా, ఆకర్షణీయంగా నిర్వహించేందుకు ఆదివాసీ సంఘాలు సమష్టిగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ఆదివాసీ సంఘాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

వన సంరక్షణ సమితిని పునరుద్ధరించాలి

ఏలూరు (టూటౌన్): కామవరపుకోట మండలం కొండగూడెం వన సంరక్షణ సమితిని పునరుద్ధరించాలని, కొండగూడెం అడవి బంజరులో పేదలు పెంచిన మొక్కలను ఫారెస్ట్ గార్డు నరకడాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ సోమవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా అటవీ శాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. దీనిపై డీఎఫ్ఓ సతీష్ స్పందిస్తూ మొక్కలను నరకకుండా చర్యలు చేపడతామని, వీఎస్ఎస్ ఉంటే దాన్ని సక్రమంగా పనిచేసేలాగా చేస్తామని, వీఎస్ఎస్ రికార్డుల్లో లేకపోతే కొత్త వీఎస్ఎస్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని సీపీఐ నేతలు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన మండలాల్లో ఉన్న ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరుతూ పీవైఎల్ ఆధ్వర్యంలో సోమవారం కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ఆ సంఘ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పీవైఎల్ డివిజన్ కమిటీ నాయకులు తగరం బాబూరావు, కట్టం నాగేశ్వరరావు మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో ప్రజలు విషజ్వరాల బారిన పడి ప్రభుత్వాసుపత్రికి వెళితే బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందడంలేదని ఆరోపించారు. దీంతో ప్రజలు ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారన్నారు. అనంతరం వినతి పత్రాన్ని ఐటీడీఏ పీఓ రాములు నాయక్‌కు అందజేశారు. సంఘ నాయకులు కొమరం నాగార్జున, పి.రాము, కరకాల నడిపిరాజు, సర్పంచ్‌లు కారం లక్ష్మి, కోర్సా గంగరాజు, ఎంపీటీసీ గోవిందరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలి

చింతలపూడి: వైఎస్సార్ సీపీకి పూర్వ వైభవం తీసుకొచ్చే క్రమంలో పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసే దిశగా ముందుకు వెళుతున్నట్లు ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల కమిటీల ఇన్‌చార్జి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొలుసు మోహన్‌యాదవ్ అన్నారు. చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజుతో సోమవారం చింతలపూడి నియోజకవర్గ అనుబంధ విభాగాల కమిటీలు, మండల, గ్రామ అనుబంధ కమిటీల నియామకాలపై చర్చించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పార్టీ అనుబంధ విభాగాల కమిటీల పర్యవేక్షణపై నియోజకవర్గ నాయకులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అసంతృప్తి మొదలైందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



చింతలపూడి: పార్టీ అనుబంధ కమిటీల నాయకులతో కొలుసు మోహన్‌యాదవ్, కంభం విజయరాజు



కామవరపుకోట: కార్యక్రమంలో మాట్లాడుతున్న కంభం విజయరాజు

కూటమి మోసాలను ఎండగట్టాలి

కామవరపుకోట: కూటమి ప్రభుత్వ నాయకుల మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని చింతలపూడి నియోజకవర్గ కంభం విజయరాజు అన్నారు. రామన్నపాలెంలో మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రామన్నపాలెం వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడిగా ఉప్పలపాటి మోహన్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలు ఏ విధంగా మోసం చేశారో గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ దేవరపల్లి రామ్మోహన్‌రావు, నానాది సాగర్, గుర్రాల రవికుమార్, మెరుగు బాబురావు, చింతనబోయిన సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మిగులు భూములు పేదలకు పంచాలి



ఎ.పోలవరంలో మిగులు భూముల్లో సాగు ప్రారంభించిన నేతలు

జంగారెడ్డిగూడెం: ఎర్రకాలువ మిగులు భూములు పేదలకు పంచాలని, సాగు హక్కు కల్పించి ఏక్‌సాల్ పట్టాలివ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలో సోమవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పర్యటించారు. ఎ.పోలవరంలో సీపీఎం జంగారెడ్డిగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో వి.శ్రీనివాసరావుకు ఘనస్వాగతం పలికారు. మిగులు భూముల్లోకి తీసుకెళ్లారు. ముందుగా ముదిగొండ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ మౌనం పాటించారు. అనంతరం మిగులు భూముల్లో పార్టీ జెండాను పాతి నాగలితో దుక్కు దున్ని నాట్లు వేసి సాగును ప్రారంభించారు. పేద ప్రజలు సాగు చేసే భూములకు ఏక్ సాల్ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలపై బనాయించిన అక్రమ కేసులను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బలరాం, జిల్లా కార్యదర్శి రవి, జిల్లా కమిటీ సభ్యులు టి.నాగమణి, పి.రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో పి.సూర్యారావు, ఫ్రాన్సిస్, తెల్లం దుర్గారావు, జి.వెంకటరావు, ఎం.సుధారాణి, తామ ముత్యాలమ్మ, ఎ.సీత, జి.సూర్యకిరణ్, ఎ.ప్రభాకర్, జె.సూర్యచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రం సేవలను వినియోగించుకోవాలి

బుట్టాయగూడెం: మండలంలోని తూర్పురేగులకుంటలో సోమవారం కేవీకే మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ ఏవీ వరప్రసాదరెడ్డి, విస్తీర్ణ అధికారి డాక్టర్ వి.దీప్తి ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు మేలైన గడ్డి విత్తనాల సాగు, పెరటి తోటల పెంపకం, మినుము, పెసర, వరి పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్షా ప్రాముఖ్యతను వివరించారు. అదే విధంగా రైతుల కోసం కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న సేవలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం రైతులకు పశుగ్రాస రకాల గురించి వివరించి సీఓఎఫ్ఎస్ 33, రెడ్ నాఫియార్, గడ్డి విత్తనాలను పంపిణీ చేశారు. అలాగే కూరగాయల సాగు పుస్తకాలను కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసి దానమ్మ, ముత్యాలరావు, అభ్యుదయ రైతులు, తదితరులు పాల్గొన్నారు.



తూర్పురేగులకుంటలో రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

సీలింగ్ భూములను పేదలకు పంచాలి

జంగారెడ్డిగూడెం: మండలంలోని పంగిడిగూడెంలో 200 ఎకరాల సీలింగ్ భూమిని హైకోర్టు ఉత్తర్వులు అనుసరించి పేదలకు పంచాలని నవ్యాంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ రెడ్‌స్టార్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నకూటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పంగిడిగూడెం సీలింగ్ భూముల విషయంలో జరిగిన అక్రమాలు, అవినీతి, కోర్టు ధిక్కార నేరాలపై ఆర్డీవో విచారణ చేసి, సీలింగ్ భూములు పేదలకు పంచాలని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డి.రంగనాథం, మడకం రామన్న, మందలపల్లి రాజు, ఎం.వెంకట్రావు, పి.ఏసు, ఎ.వెంకటేశ్వరరావు, జి.శ్యామల, పి.రవి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసిత ఆదివాసీలకు భూమి చూపించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంతో సర్వం కోల్పోతున్న నిర్వాసిత ఆదివాసీ గిరిజనులకు ఇచ్చే భూమికి భూమి పరిహారాన్ని ఇంత వరకు చూయించలేదని ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతూ సోమవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు కుక్కునూరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూరం సంజీవరావు మాట్లాడుతూ పోలవరం భూసేకరణ చేసి ఏడేళ్లు కావస్తున్నా ఇంత వరకు ఆదివాసీ నిర్వాసితులకు ఇస్తామన్న భూమికి భూమి పరిహారం భూములను ఆదివాసీలకు ఇవ్వలేదని విమర్శించారు. ఆదివాసీలకు న్యాయం చేయలేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు పైదా బొర్రయ్య, పైదా చిన్నబాబు, కూరం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ జ్వరంపై అప్రమత్తంగా ఉండాలి

ద్వారకాతిరుమల: డెంగీ జ్వరం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. జాతీయ డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా ద్వారకాతిరుమల పీహెచ్‌సీ పరిధిలోని నారాయణపురం గ్రామంలో వైద్య సిబ్బంది డెంగీ జ్వరాలపై ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. అందులో పాల్గొన్న గోవిందరావు మాట్లాడుతూ తీవ్రమైన జ్వరం, కండరాలు, కనుగుడ్లు నొప్పులు ఉంటే అది డెంగీ జ్వరం కావొచ్చన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారు వెంటనే వైద్యులను సంప్రదించి, చికిత్స పొందాలన్నారు. డెంగీకి కారణమైన ఎడీస్ దోమ ఆవాసం ఉండే నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్య శాలల్లో ఉచితంగా డెంగీ పరీక్షలు చేస్తారన్నారు. అలాగే ప్రజలు దోమల నిర్మూలనలో భాగస్వాములు కావాలని కోరారు. దోమ కుట్టరాదు, చిన్న కాటు పెద్ద ముప్పు, ఫ్రైడే డ్రై డే ఆచరించాలి అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ శబరిబాబు, రామకృష్ణ, ఆరోగ్య కార్యకర్త స్వరూప, సుజాత, విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ గౌరి, ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



డెంగీ జ్వరాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



టి.నరసాపురం: వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

డెంగీ, మలేరియాపై అప్రమత్తత అవసరం

టి.నరసాపురం: డెంగీ, మలేరియా ఇతర విష జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టి.నరసాపురం సచివాలయం–2 కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి.నాగబాబు అన్నారు. రుద్రకోటరాజు గూడెం, కాపుగూడెం గ్రామాల్లో జాతీయ డెంగ్యు వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ మండల వైద్యాధికారిణి డాక్టర్ కల్పనా రాణి ఆదేశాలతో సోమవారం ఆర్‌కేఆర్ గూడెం, కాపుగూడెంలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి

చింతలపూడి: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని వామపక్ష ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం చింతలపూడి పట్టణంలో స్మార్ట్ మీటర్ల బిగింపు విధానానికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి తుర్లపాటి బాబు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల బిగింపు విధానానికి వ్యతిరేకంగా ఆగస్టు 5వ తేదీన విద్యుత్ కార్యాలయాల వద్ద వామపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ముట్టడి చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నాయకులు పి.పాండురంగారావు, కంచర్ల గురవయ్య, ఎస్‌కే కాలేషా, మాణిక్యాలరావు, లోక్‌సత్తా నాయకులు సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

జంగారెడ్డిగూడెం: విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాన్ని బలపరచాలని ప్రజలకు వామపక్ష ప్రజాసంఘాలు పిలుపునిచ్చాయి. విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజాసంఘాలు ఇచ్చిన ఆందోళనలో భాగంగా సోమవారం బస్టాండ్ ఎదురుగా సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణం నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచే వసంతరావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు సరియం రామ్మోహన్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి పసల సూర్యారావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కెవి రమణ, ఏఐటీయూసీ మండల గౌరవ అధ్యక్షుడు జంపన వెంకట రమణరాజు, డీవైఎఫ్ఐ నాయకులు మాబూ సుభాని, వంగా గోపి తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

చింతలపూడి: భవన నిర్మాణ కార్మిక సంఘం సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చేపలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ డీఎల్ ప్రమద్వరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సంక్షేమ బోర్డులో ఉన్న కోట్లాది రూపాయలను ఇతర పథకాలకు ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘం నాయకులు జూపూడి వసంత, ఎస్‌కే సుభాని, చుండ్రు కృష్ణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.బాబు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా

కుక్కునూరు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం భవన నిర్మాణ కార్మికులు కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు కొన్నె లక్ష్మయ్య ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, నేతలు కుండా సాంబయ్య, దుక్కిపాటి మహేష్, వీరమల్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



చింతలపూడి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు



వేలేరుపాడు: తహసిల్దార్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నేతలు

వేల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలి

వేలేరుపాడు: భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని, పాత క్లెయిమ్‌లు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తహసిల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి కారం దారయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటిందని, వెంటనే భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్ యూనియన్ నాయకులు షేక్ ఖలీల్, రాజేష్, నాని, కృష్ణ, చంటి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

జంగారెడ్డిగూడెం: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి కుంచె వసంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం భవన నిర్మాణ కార్మికులతో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం జంగారెడ్డిగూడెం తహసిల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టి తహసీల్దార్ స్లీవ జోజికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ నేతలు వెంకట రమణరాజు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌ను పునఃప్రారంభించాలి

కుక్కునూరు: మండలంలోని అమరవరం ఎస్సీ హాస్టల్‌ను పునఃప్రారంభించాలని కోరుతూ సోమవారం హాస్టల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కలిసి వినతి పత్రం అందించారు. అమరవరం హాస్టల్‌లో చదువుకున్న వారు ఉన్నత ఉద్యోగాల్లో స్థిర పడ్డారని 1967వ సంవత్సరం నుంచి 2014వ సంవత్సరం వరకు కొనసాగిన హాస్టల్‌ను పునః ప్రారంభిస్తే ఆ చుట్టూ ఉన్న గ్రామాల విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

రెయిన్ కోట్ల పంపిణీ

జంగారెడ్డిగూడెం: గరుడపక్షి నగర్ ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు సోమవారం డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. సంఘ నేతలు అమృతల రంగా, నేలపోలు ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.